క్లుప్తంగా

భూమన కుటుంబానికి రుణపడి ఉంటా

– మల్లం రవికుమార్‌రెడ్డి



భూమన కరుణాకరరెడ్డి, అభినయ్, మేయర్ శిరీషతో రవికుమార్‌రెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువ జన విభాగం సెక్రటరీగా అవకాశం కల్పించిన భూమన కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానని మల్లం రవికుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పద్మావతిపురంలోని నివాసంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీషను ఘనంగా సత్కరించారు. అభినయ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని వెల్లడించారు.

గంగమ్మ పుట్టింటికి సత్కారం



సుబ్బరామిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఈఓ

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి అవిలాల నుంచి పుట్టింటి సారె సమర్పించిన గ్రామ పెద్ద ముళ్లపూడి ధనలక్ష్మి, సుబ్బరామిరెడ్డి దంపతులను శనివారం ఘనంగా సత్కరించారు. ఆలయ ఈఓ ఎ.జయకుమార్ పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న అయ్యప్పనాయుడు

తిరుపతి రూరల్ : చీని, నిమ్మ పరిశోధన స్థానం విద్యార్థులకు జీవామృతం తయారీపై రైతు అయ్యప్పనాయుడు అవగాహన కల్పించారు. శనివారం తిరుపతి రూరల్ మండలం వేమూరులో అయ్యప్ప నాయుడుకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని విద్యార్థులు సందర్శించారు. సేంద్రియ సాగు విధానం, తెగుళ్ల నివారణకు చేపట్టే ప్రక్రియలను నిశితంగా గమనించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర తనుజ, డాక్టర్ కవిత పాల్గొన్నారు.

హనుమకు పుష్పాభిషేకం



చంద్రగిరి : శ్రీవారి మెట్టు మార్గంలోని శ్రీభక్తాంజనేయ స్వామి వారి ఆలయంలో శనివారం వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఈ క్రమంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం సుమారు ఒకటిన్నర టన్నుల వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అభిషేకించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు

చంద్రగిరి : తిరుచానూరు పంచాయతీ ముత్తునగర్‌లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. వివరాలు.. జ్యోతిర్మయి అనే మహిళ తన తమ్ముడితో కలిసి నివసిస్తోంది. ఈ క్రమంలో సాయంత్రం ఇంటిపైన గది నుంచి పొగ రావడం గమనించి ఇరువురూ బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తినష్టం వాటిల్లలేదు.

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా ఆర్కాట్



తిరుపతి కల్చరల్ : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా తిరుపతికి చెందిన ఆర్కాట్ కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అశ్వత్ నారాయణస్వామి శనివారం తెలిపారు.

ఎస్వీయూ గ్రీవెన్స్ కో-ఆర్డినేటర్‌గా నిస్సార్ అహ్మద్



నియామకపత్రం అందుకుంటున్న నిస్సార్ అహ్మద్

తిరుపతి సిటీ : ఎస్వీయూ పబ్లిక్ గ్రీవెన్స్ కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎండీ నిస్సార్ అహ్మద్ నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతినాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

నాడు ఉచితం నేడు కాసులు కచ్చితం



- ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల అగచాట్లు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే చేర్చిన వలంటీర్లు
- కూటమి పాలనలో కార్యాలయాల చుట్టూ తప్పని ప్రదక్షిణలు
- చేయి తడిపితేనే సర్టిఫికెట్లు
- ఇబ్బంది పడుతున్న నగరవాసులు

తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి సర్టిఫికెట్ అవసరమైనా సులభతరంగా చేతికి అందేది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వలంటీర్ ద్వారా ఇంటికే చేరేది. ఎవరికీ పైసా చెల్లించకుండా ఉచితంగానే సకాలంలో గడప ముంగిటకు వచ్చేది. అయితే కూటమి పాలనలో ధ్రువీకరణ పత్రం తీసుకోవాలంటే జనం హడలిపోతున్నారు. కాసులు ముట్టజెప్పితేనే సర్టిఫికెట్ మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది నుంచి రెవెన్యూ అధికారుల వరకు చేయి తడిపితేనే పని చేస్తున్నారని మండిపడుతున్నారు. ముడుపులు ఇవ్వకుండా ఎవరైనా ప్రశ్నిస్తే అదిగో.. ఇదిగో అంటూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేయిస్తున్నారని వాపోతున్నారు.



రెవెన్యూ సదస్సులో సర్టిఫికెట్ల జారీపై అధికారులతో ప్రజల వాగ్వాదం (ఫైల్)

తిరుపతి అర్బన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి...ప్రస్తుత కూటమి పాలనకు తేడాను తిరుపతి వాసులు నిశితంగా గమనిస్తున్నారు. ప్రధానంగా సర్టిఫికెట్ కావాలంటే ఇంటి సమీపంలోని సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తే చాలు.. గతంలో పని పూర్తయ్యేది. లేదు వలంటీర్‌ను సంప్రదిస్తే మరింత సులువుగా ధ్రువీకరణ పత్రం వచ్చేసేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చిన్నపాటి సర్టిఫికెట్ తీసుకోవాలన్నా కాసులు చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. సచివాలయాల్లో సైతం లంచావతారులు పెరిగిపోయారు. డిమాండ్ మేరకు ప్రతి సర్టిఫికెట్‌లకు అంతో ఇంతో సమర్పించుకోవాల్సి వస్తోందని నగరవాసులు ఆరోపిస్తున్నారు. ఇదే క్రమంలో మండల కార్యాలయాల్లో సైతం కాసుల బేరం జోరుగానే సాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగర సమాచారం

మొత్తం జనాభా :	సుమారు 5లక్షలు
ప్రతి నెలా జారీ చేస్తున్న సర్టిఫికెట్లు :	30వేల నుంచి 40వేలు
ఈ ఏడాది సచివాలయాల ద్వారా మంజూరైనవి :	2.20లక్షలు

ఎంతో వ్యత్యాసం



గత వైఎస్సార్‌సీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రభుత్వానికి ఎంతో వ్యత్యాసం ఉంది. ప్రధానంగా సర్టిఫికెట్‌ల జారీలో కచ్చితంగా లంచాలు చెల్లించాల్సి వస్తోంది. అడిగింది ఇవ్వకుంటే రోజుల తరబడి తిప్పుతున్నారు. చంద్రబాబు పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని చాలామంది బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి పనికీ ఎలాంటి భయం లేకుండా ఉద్యోగులు నగదు డిమాండ్ చేస్తున్నారు.

– రమణ, తిరుపతి

ప్రభుత్వ తీరు మారాలి



కూటమి ప్రభుత్వ తీరు మారాల్సి ఉంది. పరిపాలన పూర్తిగా గాలికి వదిలేశారు. ఏ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లినా కాసులు ఇచ్చుకోవాల్సిన దుస్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఒక్క సంక్షేమ పథకాన్ని సక్రమంగా అందించడం లేదు. దీంతో జనం నానా తిప్పలు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే....గ్రామీణ ప్రాంతాల పరిస్థితి తలుచుకుంటే భయమేస్తోంది. సర్కారు పనితీరు అసంతృప్తిగా ఉంది.

-కేశవ్, తిరుపతి

పథకాలు లేవు.. పాలన లేదు



కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమీ అమలు కాలేదు. పథకాలు లేవు.. పాలన కూడా లేదు. ఏ ఆఫీస్‌కి వెళ్లినా కాసులు ఇవ్వాల్సిందే. లేదంటే నెలలు తరబడి తిరగాల్సిందే. చివరికి విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు కూడా సిఫార్సులు చేయించాల్సి వస్తోంది. ఇలాంటి దుస్థితి ఎప్పుడూ లేదు. గతంలో వలంటీర్ల ద్వారా అన్ని పనులు సకాలంలో పూర్తయ్యేవి. ఇప్పుడు లంచాలు ముట్టజెపితేనే పనులు చేస్తున్నారు.

– చందు, తిరుపతి

నోటీస్ బోర్డు

- మహతి కళాక్షేత్రంలో ఉదయం 5 గంటలకు మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పనలో భాగంగా టికెట్ల జారీ, తిరుమల వాసులకు కొండపైన బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్లో టికెట్ల పంపిణీ.
- వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుడు నెమిలేటి కిట్టన్నకు ఉద్యోగ విరమణ సత్కారం.
- పెదకాపువీధిలోని ప్రైవేట్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు బీసీ నేత సమావేశం.
- శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలకు సాయంత్రం 5.30 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ.
- తిరుపతిలోని పలు సెంటర్లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కానిస్టేబుల్ పోస్టులకు తుది రాత పరీక్ష.

పోలీస్ 30 యాక్ట్ అమలు

తిరుపతి క్రైమ్ : పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షల నేపథ్యంలో ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసనలు, ఆందోళనలను నిర్వహించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్కుల పరిశుభ్రతకు ఆదేశం



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలోని పార్కులను పరిశుభ్రంగా ఉంచాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం ఎస్‌జీటీ కాలనీలో పారిశుద్ధ్య పనులు, పార్కును పరిశీలించారు. పిచ్చి మొక్కలు తొలగించి, పూల మొక్కలు నాటాలని సూచించారు. చెత్తసేకరణకు నిత్యం వాహనాలు ఇళ్ల వద్దకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, తుడా ఈఈ. రవీంద్ర, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

పొగాకు వాడకం..అనర్థాలు అధికం





మాట్లాడుతున్న డాక్టర్ ఆర్‌వీ కుమార్, చంద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తిరుపతి తుడా : పొగాకు వాడితే అనర్థాలు అధికంగా వాటిల్లుతాయని స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ హెచ్చరించారు. శనివారం స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. వైద్యులు అల్లాడి మోహన్, అపర్ణ ఆర్ బిట్లా, హరికృష్ణ పాల్గొన్నారు

చంద్రగిరి : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చంద్రగిరిలో ర్యాలీ నిర్వహించారు.వైద్యాధికారి యుగంధర్ మాట్లాడుతూ... పొగాకును వినియోగిస్తే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వైద్యాధికారులు మధుసూదన్ రావు, రేవతి, వైద్యులు ప్రణతి, లహరి, హేమిత, ఎం.లహరి, ప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పితృవియోగం



నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలం సొరకాయలపాళానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ముక్కోటి తండ్రి సుబ్బయ్య శనివారం కన్నుమూశారు. పార్టీ మండల ఇన్‌చార్జి నల్లందుల సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి వెంటనే గ్రామానికి వెళ్లి సుబ్బయ్య భౌతిక కాయానికి నివాళులర్పించారు. నేతలు జ్యోతి, కుప్పం భాస్కర్, డీవీ మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

సైన్యంలో ఉద్యోగాలపై అవగాహన



విద్యార్థుల బహుమతులు అందిస్తున్న అసోసియేట్ డీన్

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ విద్యార్థులకు సైన్యంలో ఉద్యోగ అవకాశాలపై శనివారం ఎన్‌సీసీ 2ఏ ఆర్ అండ్ వీ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కొలోనెల్ అనూప్ మీనన్ అవగాహన కల్పించారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో అసువులు బాసిన సైనికులకు నివాళులర్పించారు.ఎన్‌సీసీలో ప్రతిభ చూపిన వెటర్నరీ విద్యార్థులకు బహుమతులు అందించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ సుధీర్ పాల్గొన్నారు.

8న 'మిస్, మిసెస్ తిరుపతి' ఆడిషన్స్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : లేఖ ఫింక్ పాటెల్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఫ్యాషన్ షో నిర్వహణకు రెండో ఆడిషన్స్ చేపట్టనున్నట్లు నిర్వాహకులు లేఖశ్రీ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఫ్యాషన్ షో ఆడిషన్స్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఆసక్తిగలవారు రూ.1,500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని అడిషన్స్ పాల్గొనవచ్చన్నారు. విజేతలకు రూ.10 వేలు బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8143685353 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. నిర్వాహకులు వెంకటరమణ, హేమంత్, మోడల్ శ్రీజ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సత్కరించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్/ తిరుపతి మంగళం/ తిరుపతి తుడా : జిల్లాలో 15 మంది పోలీసులు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. కచ్చపి ఆడిటోరియంలో వారిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఘనంగా సత్కరించారు. అలాగే టాస్క్‌ఫోర్స్‌లో ఫారెస్ట్ బీట్ అధికారిగా ఉద్యోగ విరమణ పొందిన సి.కోదండన్‌ను టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఎసీఎఫ్ శ్రీనివాస్, సీఐ సురేష్ కుమార్, అడ్మిన్ ఆఫీసర్ పాపారావు, ఏఏఓ లోకనాథం, ఆర్ఎస్ఐ వినోద్ కుమార్, ఎఫ్ఆర్ఓలు మురళీ కృష్ణ, ప్రేమ పాల్గొన్నారు. ఈ క్రమంలోనే తిరుపతి కార్పొరేషన్ సూపరింటెండెంట్ నాగేంద్ర, షరాబు శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఆడిటర్ లక్ష్మీ సౌజన్య ఉద్యోగ విరమణ పొందారు. అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషన్ అమరయ్య ఘనంగా సత్కరించారు.





కోదండన్‌కు జ్ఞాపిక అందిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, కార్పొరేషన్ ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

అలరించిన నృత్యోత్సవం



వెంకటరమణరావును సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన అన్నమయ్య సంగీత, నృత్యోత్సవం అలరించింది. ముఖ్యఅతిథిగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు దర్పణం పట్టే కళలు సమాజ శ్రేయస్సు దోహదపడతాయన్నారు. కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కళాకారులను, గురువులను ప్రోత్సహిస్తున్న జై జవాన్, జై కిసాన్, జైకళాకార్ సంస్థ అధ్యక్షుడు కె.వెంకటరమణరావు అభినందనీయులని కొనియాడారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారులు అన్నమయ్య సంకీర్తనలకు అద్భుతమైన నృత్యాభినయంతో సభికులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. నాట్య గురువులు కొండపల్లి నవ్య, గాజుల నర్మత, వాణిచంద్ర, ప్రసన్నరెడ్డి, బి.నిక్షిత, శ్వేతలతో పాటు సంగీత గురువులు వెంకటప్రమోద్ నాగజ్యోతిలను సన్మానించారు. కళాకారుల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం, బులెట్ రమణ, ఇరమునిశేఖర్, సంస్థ ప్రతినిధులు లలిత కుమారి, వసుధ,మారుతీ వరుణ్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



రోటరీ క్లబ్ సహకారంతో వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన న్యాయవాది ఎం.పురుషోత్తంరెడ్డి, హేమచంద్ర మాట్లాడుతూ సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. డాక్టర్ గోపాల్, కృష్ణకుమారి, ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు, అర్చన, వెంటాద్రి, బాలాజీ చౌదరి, మునిరాజ, రెడ్డెప్ప, వినయలత, ఆమూరి సుబ్రమణ్యం ,డాక్టర్ భారతి, అమరేశ్వరి, మల్లారపు నాగార్జున, టెంకాలయ దామోదరం, నడ్డి నారాయణ పాల్గొన్నారు.

- తిరుపతి కల్చరల్